

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 జనవరి-2025 సంచిక : 8

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........................ 2
కార్యకర్త-నైతికత ........................ 5
జ్ఞానోదయమే జీవనసాఫల్యము .... 9
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 12
శాశ్వత ధర్మగోప్త ........................ 14
సాయిభక్త దాసగణు ........................ 17
రాణి రుద్రమదేవి ........................ 20
రెండు రామచిలుకలు ........................ 22
అమర్ష భక్తుడు ........................ 26
మాతృసంస్థ కబుర్లు ........................ 28
భగవద్భక్తికి భాగ్యకాంక్ష ........................ 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ప్రార్థన అన్నమాట మనందరికీ సుపరిచితమే. మనం మందిరాల్లో, మసీదుల్లో, గురుద్వారాలలో, చర్చిలలో ప్రార్థన చేస్తూ వుంటాం. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యారంభానికి ముందు, కర్మాగారాల్లో పని ప్రారంభానికి ముందు ప్రార్థిస్తాం. పిల్లలు తల్లిదండ్రులను వేడుకొంటారు. పెద్దలు యజమానులను ప్రార్థిస్తారు. తెలిసో, తెలియకో అనేక కోరికల కోసం ప్రార్థిస్తూనే ఉంటాం అందరం. మానవుడినీ, దైవాన్నీ కూడా వేడుకొంటూ ఉంటాం. అందులో కొన్ని ప్రార్థనలు నెరవేరుతాయి. కొన్ని నెరవేరవు. అయినా మనం ప్రార్థిస్తూనే ఉంటాం. కానీ, మహనీయులైన వారు దైవాన్ని ప్రార్థిస్తారే తప్ప మనష్యులను కాదు. "పుట్టుభోగులము మేము పూని హరిదాసులము నట్టనడిమి దొరలు మాకీయవలెనా" అన్నారు అన్నమాచార్యుల వారు.

కొన్నిసార్లు మనం ఎంతో ఆర్తితో ప్రార్థిస్తాం వేటికోసమో. కానీ, అవి మనకు పనికొస్తాయో లేదో మనకు తెలియదు. అలా వివేకం లేకుండా కోరే కోరికల వలన మనకెన్నో నష్టాలు, కష్టాలు కలుగుతాయి. సామాన్య మానవునికి దైవం ఎక్కడుంటాడో, ఎలా ఉంటాడో, అసలు ఉంటాడో లేడో కూడా తెలియదు. పండితుల దగ్గర విన్నదాన్నీ, శాస్త్రాలలో చదివిన దాన్నీ బట్టి ఏవో కొన్ని భావాలు ఏర్పరచుకొంటాడు. ఐతే సాధారణంగా మనిషి ఆనందంగా ఉన్నపుడు భగవంతుడిని తలుచుకోడు. కన్నడంలో ఓ సామెత ఉంది "సంకట బందగ వెంకట రమణ" అని. బండి సవ్యంగా నడిస్తే దైవం ఎందుకు గుర్తుకు వస్తాడు! పైగా మన కష్టాలన్నిటికీ కారణం దేవుఁడేనని నిందిస్తాం కూడా. ఇది మూర్ఖత్వం మన శుభాశుభకర్మల

ఫలితాలే మనకు కష్టసుఖాలను ప్రసాదిస్తాయి తప్ప దైవం కారణం కాదు.

కుంతీదేవిని ఒకసారి కృష్ణుడు అడిగాడట-"అత్తా, నీకేమన్నా కావాలంటే అడుగు, నేను వెళ్లిపోతున్నాను" అని. ఆ తల్లి "మరిన్ని కష్టాలివ్వవయ్యా" అన్నది. "అదేమిటత్తా!" అంటే "అవునయ్యా! కష్టాలు లేకపోతే నిన్నెందుకు తలుచుకొంటామయ్యా! కష్టాల్లో కాగుతుంటేనే కన్నయ్య గుర్తుకు వచ్చేది!" అన్నది. అదీ సంగతి. మొత్తం మీద ప్రార్థన అన్నది మన మనసుకు ప్రశాంతినీ, మన ఇక్కట్ల చీకట్లు తొలగించే కాంతినీ ఇస్తుందని మనకు నిర్ధారణే. ఎటొచ్చీ 'ప్రార్థన ఎలా వుండాలి?' అనే దాని మీదనే కొంత అవగాహన కావాలి.

మన మిత్రులతోను, బంధువులతోను కూడా చెప్పకోలేని సమస్యలను పరమాత్మని ముందు విన్నవించుకోగలం. మన విశ్వాసాన్ని ప్రదర్శించగలది ప్రార్థనే అయితే ప్రార్థనకు మాటలే అక్కరలేదు. అసలు అది కావాలి, యిది కావాలి అని అడుగనూ అక్కరలేదు. మనకేం కావాలో మనసు సృష్టించిన తండ్రికి తెలియదా? విశ్వాసం లేని ప్రార్థన కేవలం మాటల పేర్లు అవుతుందే తప్ప మరొకటి కాదు. ప్రార్థన ఎవరికోసం చేస్తున్నాం? పరమాత్మని కోసం. ఆయన నీవు వినయంతో తలవంచి చూస్తే చాలు-నీ లోపలే ప్రకాశిస్తూ కన్పిస్తాడు. అంత చేరువలోని ఆయన కోసం శబ్దాడంబరం దేనికీ? స్తుతి అయినా, ప్రార్థనైనా నిశ్శబ్దంగా చేసే దానికి విలువ ఎక్కువని గుర్తుంచుకోవాలి.

అదేగాక-మనసు, తనువు, ఆత్మ కలిసి ప్రార్థించటం అనేది సామాన్యమైన విషయం కాదు. అది ఒక్కరోజులోనో, ఒక నెలలోనో, ఓ ఏడాదిలోనో తేలికగా అలవాటయ్యేది కాదు. నిరంతర దీక్షతో వచ్చేది. కనుక నిరంతర శ్రద్ధ, అభ్యాసం అవసరం. మనం ప్రేమించి ప్రార్థించే దైవాన్ని సర్వజీవుల లోనూ చూచే శక్తి కలిగేంతవరకూ మన ప్రార్థన కొనసాగవలసిందే. అదే





మంత కష్టం కాదు. ఎంచేతంటే ఒకసారి ప్రార్థనాబీజం మనసు లోతుల్లో నాటుకుంటే చాలు - అది మొలకెత్తి, శాఖలు వేసి మహావృక్షంగా మారుతుంది.

భగవంతుడు కోరేది పరిపూర్ణ ఆత్మార్పణగానీ-ఏదో కొంత భాగం యిస్తే తృప్తిపడే రకం అధునాతన మాయగురువుల వంటివాడు కాడతడు. ఏదో ఆధ్యాత్మికత వరకే భగవంతుడుగానీ లౌకిక జీవనం విషయం మన వ్యక్తిగతం గదా-దేవుడికి సంబంధం లేదు - అనుకొనే మూర్ఖత వద్దు. ప్రతి విషయాన్నీ భగవత్‌దృష్టితో చూడటం అలవరచుకొందాం.

మన నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకూ ప్రార్థన జవాబిస్తుంది. సమస్యలను ఎదుర్కొనే శక్తినీ, బలాన్నీ యిస్తుంది. మన జీవితాలపై భగవత్కాంతిని ప్రసరింపజేసే ఏకైక సాధనం ప్రార్థనే. అసాధ్యాలనుకొన్న వాటిని సాధ్యం చేయగలదు. మనం చాలా యిష్టపడే వాటిలో అనేకం-అనేకం ఏమిటి-మొత్తమున్నూ అశాశ్వతాలే. ఒక్క భగవత్ స్నేహం మాత్రమే శాశ్వతం. దానికి మార్గం ఆత్మార్పణతో కూడిన ప్రార్థన. భగవంతుడు మనకు అన్నీ ప్రసాదించనూ గలడు. మన దోషాలను క్షమించనూగలడు. కానీ, మనిషి మాత్రం మన నుండీ మేళ్లు పొందనూగలడు. మర్చిపోనూ గలడు. అందుచేత మనుష్యులను (అదెంత దగ్గరివారని మన మనసు భ్రమింపజేసినా సరే) దూరంగా ఉంచి, దైవానికి దగ్గరయ్యే త్రోవన పయనిద్దాం.

'బంధుమిత్రులు, సన్నిహితులు-అందరూ ద్రోహం చేయవచ్చు గానీ పరమాత్ముడు మాత్రం చేయడు' అన్నది ఉపనిషత్సూక్తి. అందుచేత మనకు మనంగా సమాధానం నిర్ణయించుకోలేని ప్రశ్నలు, సమస్యలు ఎదురైనపుడు-ఖచ్చితంగా తోడ్పడగలిగేది ప్రార్థనేనని గుర్తిద్దాం'. ఆ ప్రార్థన కూడా మన ఉచ్ఛ్వాస, నిశ్వాసాలలో ఒక భాగంగా మారిపోయేంత సహజంగా సాగిపోయేలా అభ్యాసం చేద్దాం.

# కార్యకర్త-నైతికత

- శ్రీ దత్తోపంత్ ఠేంగ్డే

ఆదర్శవాదానికి కట్టుబడిన నాయకత్వం సామాజిక రంగంలో వ్యవహరించేటపుడు తన విలువల విషయంలో రాజీపడదు. అందువల్ల ఎంత నష్టం భరించవలసి వచ్చినా సరే. మన పనిలో మన తాత్కాలిక ఉద్దేశ్యం. తాత్కాలిక కార్యక్రమ యోజన మొదలైన అన్నిటిపైనా చర్చలు, రాజీలు ఉండవచ్చు. కానీ మన సంస్థ విచారధార. అంతిమలక్ష్యం, దానిని అనుసరించి ఉన్న మన నైతిక విలువలు - వీటి విషయంలో మాత్రం రెండు అభిప్రాయాలకు, చర్చలకు, రాజీలకు అవకాశమే లేదు.

ప్రస్తుతం మన చుట్టూ ఉన్న అవకాశవాద వాతావరణంలో ఇటువంటి నైతిక నిష్ఠ, ఉన్న వ్యక్తి ఒక రకంగా ఒంటరితనాన్ని భరిస్తూ కాలం గడపవలసి వస్తోంది. పూజ్య డాక్టర్జీ కాలంలో సంఘ కార్యం ప్రారంభం కాకముందు తమని తాము హిందువులుగా చెప్పకొనేందుకు సిగ్గుపడే పెద్దమనుష్యులు "ఇది హిందూ రాష్ట్రం అనే పిచ్చివాడెవడు?" అటుంటే పూజ్య డాక్టర్జీ "నేను కేశవ బలిరామ్ హెడ్గేవార్‌ను చెబుతున్నాను-ఇది హిందూ రాష్ట్రమని" అనేవారు. అంటే అటువంటి నాయకుడు యీ ధ్యేయనిష్ఠకు సంబంధించిన ఒంటరితనాన్ని సహించవలసి వుంటుంది. ఈ శతాబ్దపు మహాదార్శనికులలో ఒకరైన జిడ్డు కృష్ణమూర్తిగారి కవిత ఒకటుంది. కొండ శిఖరానికి వున్న ఒక చెట్టును ఉదహరిస్తూ ఆయన అంటున్నారు.

'Stand alone Like a solitary tree on the mountain peak
For solitude is the price of the greatness, Stand alone'
(ఒంటరిగా నిలబడు పర్వత శిఖరంపై వున్న ఒంటరి వృక్షం వలె.
ఎందుకంటే గొప్పతనానికి వెల ఒంటరితనం, ఒంటరిగా నిలబడు)





శిఖరంపై ఒంటరిగా నిలబడగలిగినవారే ఏదైనా గొప్ప పని చేయాల్సి వస్తే చేయగలుగుతారు. పెద్దరికానికి చెల్లించవలసిన మూల్యం ఒంటరితనం. ఈ మూల్యం చెల్లించలేకపోతే నాయకత్వం వహించగలమన్న ఆశ పెట్టుకోకు, కార్యకర్తగా వుండాలంటే నాయకత్వం వహించాలంటే కొంత మూల్యం చెల్లించవలసి వుంటుంది.

**కాంతా కనకాల పట్ల జాగరూకత :**

నైతిక నిష్ఠ విషయంలో వ్యక్తిగత ప్రవర్తనకు స్పష్టంగా చెప్పాలంటే కాంతా కనకాల విషయంలో వ్యవహరించే తీరుకు కూడా చాలా ప్రాముఖ్యం ఉంది. నైతిక దృష్టితో కార్యకర్త స్వీయ జీవనం నిష్కళంకంగా ఉండాలి. నిత్య జీవితంలో విలువలు వేరు, సామాజిక జీవితంలో విలువలు వేరు-అన్న ద్వంద్వ ప్రమాణాలు పనికిరావు. నైతికాచరణ శిథిలావస్థకు చేరినట్లు చెప్పబడే పాశ్చాత్య ప్రపంచంలో కూడా సామాజిక కార్యకర్తలలో నైతిక పతనాన్ని సహించరు. ఇంగ్లాండులో ప్రోఫ్యూయో వ్యవహారంలో యిది స్పష్టమైంది. ఆ మేరకు ఆయన ప్రతిష్ఠ దిగజారింది. కొద్దికాలం క్రితం ప్రెసిడెంట్ క్లింటన్ మోనికా లూయిన్‌స్కీల గురించి అమెరికా అంతట చర్చించబడిన వ్యవహారం వలన అమెరికా ప్రజానీకంలోని, మేధావులలోను, సామాజిక శాస్త్రజ్ఞులలోని ఒక పెద్ద వర్గంలో నైతికపరంగా ఆయన విలువ పడిపోయింది. కానీ దానితో పోల్చి చూస్తే దేశపు భౌతిక సమృద్ధి విషయంలో ఆయన యొక్క రాజకీయపరమైన, పరిపాలనా పరమైన నాయకత్వం యొక్క ప్రతిష్ఠకు తగిలిన దెబ్బ తక్కువే. కమ్యూనిస్టు ప్రపంచంలో నైతిక విలువలకు ప్రాధాన్యం యివ్వబడదని కొందరనుకుంటారు. ఎందుకంటే కారల్‌మార్క్స్ వివాహ వ్యవస్థని, కుటుంబ వ్యవస్థని తిరస్కరించాడు. కానీ, యీ విషయంలో ఆయన వ్యతిరేకత సిద్ధాంత పరమైనది. నీతిరాహిత్యంపై ఆధారపడినది కాదు. మార్క్స్ యొక్క యీ సైద్ధాంతిక భూమికను పరిగణనలోకి తీసుకొనకపోవడం వల్ల రష్యాలో

అచ్చమైన కమ్యూనిస్టు కార్యకర్తకు నైతిక విలువల గురించి పట్టించుకో వలసిన అవసరం ఏమీ లేదని భావించే వాతావరణం, వ్యవహార సూత్రాలు ఏర్పడ్డాయి. సరికొత్త సామ్యవాదులు దీన్ని Ink pot theory అనే పేరుతో ఒక సిద్ధాంతంగా కూడా తయారుచేశారు. కానీ, లెనిన్ ట్రాట్స్కీ వంటి వాస్తవదృష్టి గల నేతలు యీ ధోరణిని చీదరించుకుని నీతిబాహ్యమైన కార్యకలాపాలకు వ్యతిరేకంగా కఠినమైన హెచ్చరికలు చేశారు. వాళ్ళు స్పష్టంగా "తన సొంత జీవితంలో విశ్వసనీయుడు కాని వ్యక్తి సామాజిక జీవనంలోనూ విశ్వస నీయుడు కాలేడు" అని చెప్పారు.

ముందే మాసిపోయి వున్న వస్త్రంపై మళ్ళీ నాలుగైదు మరకలు పడ్డా చూసే వారికి పెద్ద తేడా అనిపించదు. కానీ స్వచ్ఛంగా, శుభ్రంగా వున్న బట్ట మీద ఒక నీటి చుక్క పడినా దాని తాలూకు మరక చూసేవారి దృష్టిని ఆకర్షిస్తుంది. ఆ నీటిచుక్క మరుక్షణంలో ఆరిపోయేదయినా సరే" అనేవారు పూజ్య గురూజీ. కార్యకర్త యొక్క నైతికతను సమాజం ఒక కంట కనిపెట్టే ఉంటుంది. కాంతా కనకాల విషయంలో అతడి ప్రవర్తన తీరును వెయ్యికళ్లతో తనిఖీ చేస్తుంది. సమాజానికి నేతృత్వం వహించ వలసిన కార్యకర్త అందరికీ ఆదర్శప్రాయుడుగా ఉండటం అవసరం. కనుక అతడు యీ విషయంలో చాలా జాగరూకుడై ఉండాలి. ఇదే విషయం గురించి ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. "Ceaser's wife must be above suspicion" ప్రస్తుత సందర్భంలో దానిని దృష్టిలో పెట్టుకోవడం మంచిది.

**నైతికతకు పురస్కారం నైతికతే :**

ఇటువంటి నైతికతకు ప్రతిఫలంకానీ, పురస్కారం కానీ ఏమైనా ఉంటే అది నైతికతే. దానివల్ల ఏ ప్రాపంచిక ప్రయోజనమో లభించాలనే కోరిక మనసులోకి రాకూడదు. కార్యకర్తకు నైతికపరమైన ప్రేరణ యిచ్చేందుకై కొందరు తొందరపాటుతో వ్యవహరించే మార్గదర్శకులు ఒక్కొక్కసారి తప్పుడు పద్ధతిలో ప్రయోగాలు చేస్తుండటం కనిపిస్తుంది. "నైతికంగా మంచి ప్రవర్తనను కలిగి ఉంటే కీర్తి, పదవి, ప్రతిష్ఠ మొదలైన వన్నీ లభిస్తాయి. లేకపోతే మీరు వీటన్నిటినీ కోల్పోతారు" అనే ధోరణిలో





ఉద్బోధించడం ఇటువంటి పొరపాట్లలో ఒకటి. సిద్ధాంతపరంగాను, వ్యవహారికంగానూ కూడా యిది తప్పే. నైతికత నుంచి ఏదో ప్రాపంచిక లాభాన్ని ఆశించే మనస్తత్వాన్ని నిర్మాణం చెయ్యకూడదు.

ఈ విషయంలో Ivanhoe (ఐవాన్‌హొ) అనే తన పుస్తకానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో సర్ వాల్టర్ స్కాట్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు మనకు ఉద్బోధకరమైనవి.

క్లుప్తంగా చెప్పాలంటే ఆయన మాటల సారాంశం ఇది-సద్వర్తనకు, కర్తవ్య పరాయణకు భౌతిక సుఖసంపదలు ప్రతిఫలంగా లభించినట్లు ఒక గ్రంథంలో ఏ పాత్రనైనా చిత్రిస్తే అందువల్ల ఆ పాత్రకు ఔన్నత్యం కాక హీనత్వమే కలుగుతుంది. పుస్తకాలను చదివే యువతరం పాఠకులపైన యిందువల్ల ముద్రితమయ్యే తప్పు సంకేతాల ప్రభావం చాలా ప్రమాద కరంగా ఉంటుంది. ప్రస్తుతమైన జీవనచిత్రాన్ని ఒక్కసారి చూస్తే స్వార్థాన్ని త్యజించి కర్తవ్యాన్ని నిర్వహించడం వల్ల ఆదర్శాలకు, ఆకాంక్షలకు బలి పెట్టడం వల్ల అటువంటి ప్రతిఫలం లభించడం అరుదుగా మాత్రమే జరిగే విషయమని తెలుస్తుంది. మానసిక ఔన్నత్యంతో కర్తవ్యం నిర్వహణ చేశామన్న స్ఫురణ వలన కలిగే ఆత్మగతమైన ప్రశాంతతే అంతకన్నా అధిక మైన ప్రతిఫలం. అది వేరే ఏ రకంగానూ లభించదు. వేరెవరూ దానిని తీసుకొనిపోలేరు.

ఇంతకుముందు చెప్పుకున్న విషయమే-ఒకసారి ఎవరో మహాత్మా గాంధీని "ప్రాపంచిక వ్యవహారాల్లో నీతిసూత్రాలు మంచివే. కాని రాజకీయాల్లో ప్రజాసంబంధమైన విషయాల్లో నైతిక సూత్రాల అవసరమే ముంది? అని అడిగారు. మహాత్ముడు ఇలా అన్నారు "సీజరు రోమన్ చక్రవర్తి. ఆయన పరిపాలనా కాలం ఏసుక్రీస్తు కన్నా కొన్ని సంవత్సరాల ముందే. మరి ఇప్పడు చూడు సీజర్ నేడు లోకంలో ఎందరికి గుర్తున్నాడు? ఏసుప్రభువు పేరు ప్రపంచంలో మూలమూలలా వినపడుతోంది. ఇది దేని సూచన?"

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

పైగా తీర్థయాత్రలు చేసినవారు ఎలా మనోభావాలు వ్యక్తుపరుస్తారంటే బ్రహ్మాండమైన భోజనం, కనులు విందుచేసే దృశ్యాలు, అరణ్యాలు, లోయలు, నదులు, పర్వతశ్రేణి - ఎంత నయనానందం అంటారు. అంటే ఏమిటి, నీ ఇంద్రియాలు ఇంకా ప్రేరణ కల్గించినాయి అని అర్థం. మరి ఇంద్రియ నిగ్రహం ఎలా వస్తుంది. ఇంద్రియ నిగ్రహం లేకుండా, ముక్తిని పొందగలమా? ఎందుకు ఉన్న కొంత సమయాన్ని అంతర్ముఖం కాకుండా బాహ్యంగా ప్రయాణించి సాధనలు మాని వ్యర్థం చేసుకొంటారు మనుషులు. ఇక కొందరు సంసారంలో చాడీలు, బంధువులు, సినిమాలు, బంధాలలో మునిగిపోతారు.

కొందరు అన్నీ వింటారు, అందరి ఉపన్యాసాలు వింటారు, గురువుల్ని కలుస్తారు, కాని సాధనలు శూన్యం. అంతఃయానం, ధ్యానం శూన్యం, అభ్యాసం శూన్యం.

నేను ఆత్మను, దేహంలో ఉన్నాను, దేహం నేను గాదు, ప్రపంచంలో ఏది నాది కాదు. శరీరం, మనస్సు నేను కాదు. కర్మలన్నీ మనస్సు, శరీరానికే నాకు కాదు. నేను పరమాత్మలో చేరాలి. సాధన చేయాలి. నేను వైరాగ్య భావనతో ఉంటాను. నా కర్తవ్యం ఫలాపేక్ష లేకుండా, నా బాధ్యత నేను నెరవేరుస్తాను. సత్యం, అహింస, ప్రేమ, అపరిగ్రహం, అస్తేయం, సహనం, త్యాగం, కరుణ, దానం, సేవ అనేవి పాటిస్తాను. వీటిని ఎన్నడూ వదిలిపెట్టను.

అసలు ఉపనిషత్‌లు, వేదం ఏం చెబుతున్నాయంటే ఆత్మను మించిన దేవుడు లేడు అని చెబుతున్నాయి. ఆత్మ జ్యోతి స్వరూపం. పరమాత్మ నీలో





ఉన్నాడు. నీ చుట్టూ ఉన్న మనుషులలో, జీవులలో ఉన్నాడు. సృష్టిలో పరమాత్మ లేని చోటు లేదు. విష్ణువు అంటేనే విశ్వం. అంతా వ్యాపించిన వాడు అని అర్థం. అందుకే భగవద్గీత విభూతియోగంలో పర్వతాలలో, నదులలో, పాములలో, మృగాలలో, మనుషులలో, రాక్షసులలో, వృక్షాలలో, దేవతలలో, పక్షులలో అన్నింటిలోనూ ఉన్నానని చెబుతాడు.

ఇది సంపూర్ణంగా అర్థం చేసుకొని చుట్టూ ఉన్న భగవంతుని సేవ వదలి, లోపలి ఉన్న పరమాత్మను వెదకటానికి సాధనలు మాని, దూరాన ఉన్న పరమాత్మ కోసం వెతకటం అంటే ఇంకా నీవు పరమాత్మను సంపూర్ణంగా అవగాహన చేసుకోలేదని అర్థం. మీరే ఆలోచించండి ఈ విషయం మీద చెప్పటం నా ధర్మం-వినటం, ఆచరించడం మీ ధర్మం.

ముఖ్యంగా మీరు తెలుసుకోవల్సింది భగవంతుని చేరాలంటే, ఆయన అనుగ్రహం ఉండాలి. రెండవది మన కర్మలు ప్రక్షాళన అవ్వాలి. ఎందుకంటే మనం ఎవరినన్నా కలవాలంటే వారికి ఇష్టం లేకపోతే వారు పర్మిషన్ ఇవ్వరు, కలవలేము. పరమాత్మ కూడా అంతే, నువ్వు పాపకర్మలు చేస్తూ కలవాలంటే ఆయన దర్శనం కల్గదు. ముందు మన అహంకారాన్ని నిర్మూలించుకొంటే ఆయన పిలుస్తాడు. అందుకే ఎక్కువగా సత్సంగాలు, భాగవతం, భగవద్గీతలో లీనమయితే కొంతకాలానికి మన ఆలోచనలు మారి మనం పరివర్తనం చెందుతాము.

## 4.0 పరిపూర్ణ ప్రేమ భావమే ముక్తికి సోపానం

నేను ప్రేమిస్తున్నాను అనే దానికన్నా నేను ప్రేమ స్వరూపుడిని అనే దానికి చాలా తేడా ఉంది. మనిషి ప్రేమ స్వరూపుడు కావాలి. ప్రేమ స్వరూపుడు అన్ని జీవుల పట్ల సమమైన ప్రేమ ప్రసరింపజేస్తాడు. అదే డివైన్ ప్రేమ అంటే. సత్యసాయిబాబాగారు ప్రేమే నా స్వరూపం అన్నారు.

ప్రతి వాళ్ల ప్రేమ నిర్వచనం, వాళ్ల స్వభావాన్ని, అవసరాలని బట్టి ఉంటుంది. అది నిజమైన ప్రేమ కాదు. మనిషి ముందు తన్ను తాను

ప్రేమించుకోవాలి. తనను ప్రేమించుకోలేని వ్యక్తి ఇతరులకు ప్రేమను ఇవ్వలేడు. తనను తాను ప్రేమించుకోవటం అంటే తనలోని అహంకారం, ప్రతీకారం, క్రోధం, ద్వేషం, లోభం, అసూయ, స్వార్థాలను నశింపజేయాలి. తనలో క్షమ, సహనం, కరుణ, దానం, త్యాగం, ప్రశాంతత అనే భావాలు జనించాలి. అప్పుడే ఆ మనిషిలో ప్రేమ భావం ఉండి, తనను తాను ప్రేమించుకోగలడు. అప్పుడు తనలో వున్న ప్రేమ భావాలను ఇతరులకు ఇవ్వగలడు.

దీని అర్థం ఏమిటి అంటే అరిషట్ వర్గాలున్న చోట ప్రేమ భావం ఉండదు అని అర్థం. అవి లేని వ్యక్తి హృదయంలో ప్రేమభావం ఉంటుంది. అది ఉన్నత ప్రేమను ఇవ్వగలదు. ప్రేమ అనేది శారీరక సంబంధం లేనిది. ఇది మనసుకు, హృదయానికి సంబంధించినది. ప్రేమ అంటే ఇద్దరు ఒకే విధంగా చూడడం, ఒకే విధంగా ఆలోచించటం, ఒకే మనస్సుతో ఉండటం. ఇతరులను ప్రేమతో చూస్తే సంతోషం దానంతట అదే వస్తుంది.

పవిత్రమైన ప్రేమకు రాగద్వేషాలు ఉండవు, కారణాలు, లెక్కలు, లాభ నష్టాలు ఉండవు. నిస్వార్థంగా ఉండే వ్యక్తి మాత్రమే ప్రేమించగలడు.

స్వచ్ఛమైన ప్రేమ ఒక పవిత్రమైన భావన. ప్రేమ స్వరూపియైన మనిషి వ్యక్తిత్వం మహోన్నతమైన స్థితికి చేరుకుంటుంది. ప్రేమకు కాలపరిమితి లేదు. ప్రేమ స్వరూపి తను జీవించినంత కాలం తన స్వచ్ఛమైన ప్రేమను ఇస్తూనే ఉంటాడు. పరిస్థితులు, మనుషుల భావాలు ఎలాంటివైనా సరే ప్రేమిస్తూనే ఉంటాడు.

ప్రేమ ఎంత గొప్పది అంటే కొన్ని కుందేళ్లు కాన్సర్ వ్యాధి కారణమైన రసాయనాల వాసనకు గురవుతాయి. అయితే ప్రతిరోజు వాటికి ఆహారం వేసే అతను ఒక నాలుగు కుందేళ్లను తన ఒడిలోకి తీసుకుని నిమిరి, ప్రేమతో మాట్లాడి ఆహారం తినిపిస్తాడు. కొంతకాలానికి ఈ నాలుగు కుందేళ్లు బాగుంటాయి. మిగతా కుందేళ్లు కాన్సర్‌వ్యాధితో చనిపోతాయి. ఇది నిజంగా జరిగింది. ప్రేమకు అంత శక్తి ఉంది.

**(సశేషం)**





# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

సీ. నవవిధ భక్తులు నతనికి దెలిపెను
గుఱ్ఱపు లద్దెల గుట్టు విడగ
శ్రవణ, కీర్తన, శ్రద్ధతో స్మరించు
నామ జపము, సేవనంపు పాద
యుగళంబు, అర్చన యున్ను, వందనమున,
చేయగా దాస్యంబు జీరి యతని,
సఖ్యత గల్గును, సర్వేశు కాత్మ ని
వేదనంబు నుఁజేయు వేద్యు డవగ

తే.గీ. వచ్చు శ్రీహరి నీకడ వరము నొసగ
భక్తుని యచంచల నిరత భక్తి కతన
భక్తి సంపుష్టమవనంత వరకు, నెల్ల
సాధనంబులు వ్యర్థంబు, సాధ్య మవదు 8

కం. సాయి త్రికాలజ్ఞుండును,
సాయియె పరమాత్మ, నాత్మసాక్షికి గనగన్
సాయిని మించిన దైవము
నేయెడ లేడంచు నాత్మ నెఱుఁగఁగ వలయున్ 9

తే.గీ. పండరి పురంబు నందున పరుష మాడి
శిరిడి కొచ్చెను దర్శించ సిగ్గు బడక
సాయి గని వకీలు ను దెప్ప సత్య మెఱిగి
వగచె పొరపాటు గ్రహియించి వందనమున 10

ఆ.వె. సాయి సకల మెఱుఁగు సర్వోప గతుండు
సాయి కనులు గప్ప సాధ్యమవదు
అలరి యుండు నతడు అణిమాది గుణముల
ఆత్మ లందు జేరు నాత్మజుండు 11



## 26. నీదు అహము విడచి



ఆ.వె. సూర్య దర్శనంబు సూటిగా గనరాదు
ఆకు సందు లందు నతని గనుము
విదియ చందురున్ని వీక్షించ నీలాగు
వలను పడును శుక్ల పక్షమందు 1

ఆ.వె. దేముని గనలేము దివ్య కన్నులు లేక
గురుని వలనె నతని గురుతు దెలియు
వేరు మార్గ మొండు వెదుకగా పనిలేదు
గురుని సేవ నీవు గురిగ జేయ 2

ఆ.వె. వేద వాఙ్మయంపు వేత్తలకైనను
ఆది శేషునకును యలవి గాదు
దేవుని గుణమున్ను ధీటైన రూపంబు
పొగడ పొల్లులేక పొందుగాను 3

ఆ.వె. నిన్ను గనగ జేయు నిటలాక్షు రూపంబు
దివ్య కనుల నిచ్చి దివ్య తేజు
గురుని పాదములను గుండెలో ధ్యానించ
భక్తి శ్రద్ధ గలిగి భవ్యరీతి 4

(సశేషం)





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

(గత సంచిక తరువాయి)

పాండవులకు జరిగిన అన్యాయగాథ ఆర్యావర్తంలోనే కాక ఆవలి అంచులదాకా చేరింది. పడమట సాళ్వ దంతవక్త్రులతో, దీర్ఘపోరాటంలో నిమగ్నులై ఉన్న కృష్ణబలరాములకు, మిగతా యాదవులకు ఈ వర్తమానం అందింది.

కృష్ణుడు కదిలాడు. రాజసూయంలో సన్నిహితులైన రాజులందరికీ వార్తను పంపి, కామ్యకానికి రమ్మని కబురు పంపాడు. తాను, స్వయంగా అష్టభార్యలతో, యాదవ ప్రముఖులతో కలిసి బయలుదేరాడు. చేదిరాజు దృష్టకేతువు కృష్ణుని ప్రయాణం గురించి విని తానూ సపరివారంగా దారిలో ఆయనతో కలిసి బయలుదేరాడు. కేకయ వీరులు, దృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ సంతానం కామ్యకానికి ప్రయాణమైనారు.

కామ్యకవనం సాత్విక తేజంతో వెలిగిపోతున్నది.

కాలు నేలనాన్చ నక్కరలేని జీవితాన్ని గడిపిన ద్రౌపది, ఒక్కరొక్కరే మహా సామ్రాజ్యమేలగలరన్న మహామహితాత్ములు, పంచాగ్నుల వలె వెలిగే పాండవులూ, అధ్యయనాధ్యపనాలు చేస్తూ, ఆ అడవుల్లో కూడా శిష్య పరంపరను తీర్చిదిద్దుతూన్న శ్రోత్రియులూ, అనాచ్ఛాదిత తరువుల మొదళ్ల, పర్ణశాలల్లో, గడ్డి పరచిన శయ్యలపై నిదురిసూత కందమూలాలు భుజిస్తూ జీవిస్తూండడం చూడగానే, వచ్చిన వారందరి కండ్లూ కొండవాగులైనాయి.

ధర్మరాజు అందరినీ ఒక్కొక్కరుగా అందరినీ ఆప్యాయంగా పరామర్శించాడు. కృష్ణుని వెంట సుభద్ర-అభిమన్యుడూ వచ్చారు. అతిథులుగా వచ్చినా, ఆ వచ్చిన ప్రతి వారూ ఏవో సంభారాలు వెంటతెచ్చారు. ఆ రోజల్లా ఆనందంతో, ఆలింగనాలతో, ఆశ్వాసనాలతో, కన్నీళ్లతో, ఘడియ ఒక లిప్తగా

గడిచిపోయింది. ద్రౌపదిని కృష్ణుని భార్యలు, సుభద్రా తమ కౌగిలింతల నుంచి విడువనే లేదు.

మరునాడు ఉదయం అందరూ తమ తమ నిత్య విధులను పూర్తి చేసుకున్న తరువాత యుధిష్ఠిరుని పర్ణకుటి ముందున్న విశాల వటవృక్షం నీడన సమావేశమైనారు. పలకరింపులు, సౌహార్ద్ర సంభావనలూ పూర్తి అయిన తరువాత 'ధర్మరాజా! ఏమిటయ్యా ఇది-ద్యూతం సప్త వ్యసనాలలో ఒకటని కదా శాస్త్రాలు చెపుతాయి. అలాంటి క్రీడకు నీవెలా అంగీకరించావయ్యా' అని కృష్ణు డడిగాడు.

'కృష్ణా! నీవు మనసులను, మనుష్యుల్ని చదవగల పారదర్శివి. నేనే కుటుంబ ధర్మాన్ని కాపాడకపోతే ప్రజలు ధర్మాన్ని ఎందుకాచరిస్తారు? పోగా నీ వల్లనే కాలవశాన రాజులు, క్షత్రియులు మృత్యువు పాలవుతారని సాక్షాత్తు మహాముని వేదవ్యాసుల వారే స్పష్టంగా సంకేతించినప్పడు, నేను ద్యూతానికి వెళ్లకపోతే, యుద్ధం తప్పేది కాదు కదా! దుర్యోధనాదులు యుద్ధానికి సిద్ధులయ్యే, ద్యూతానికి ఆహ్వానం పంపారు. రాజసూయం తరువాత రాజులు ఎవరి రాజ్యాలకు వారు వెళ్లినా దుర్యోధనుని కూటమిలోని వారు హస్తినలోనే ఉన్నారు. వారు యుద్ధానికీ తలపడ్డారు. కానీ ఒక సాకు కావాలి కదా! శకుని సలహా మేరకు ఈ విలక్షణమైన ఆచారాన్ని ప్రయోగించారు. నేను అంగీకరించకపోతే యుద్ధం తప్పక పోయేది. చారులు అందజేసిన సమాచారం అది. అదే అనుమానం విదురుల వారికి కూడా కలిగింది. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, భార్గవ పరశురాముని శిష్యులు. కృపుడు, అశ్వాత్థామ, దుర్యోధనుడు, వివిధ రాజ్యాల నుండి వచ్చిన రాజన్యుల సేనలు వచ్చి హఠాత్తుగా పైబడితే మనం ఎంత విక్రమించినా గెలవగలమా? అర్థం లేకుండా మారణహోమం, రక్తపాతం జరుగనిచ్చే బదులు యుద్ధాన్ని, రక్తపాతాన్ని ఆపడం మేలు కాదా? కురుకులం ధర్మరక్షణకు కేంద్రంగా నిలబడాలంటే దూకుడుతో అయ్యే పనేనా? నీవూ, నీ బలగమూ అందుబాటులో లేరు. మరి అప్పటికీ అదే






ధర్మమనిపించింది.

'ధర్మరాజా! ఆర్యావర్త రాజలోకమంతా ఎంత దిగ్భ్రాంతి చెందిందో గ్రహించండి. అడవులలో ఉండమని షరతు పెట్టడానికి వారెవరయ్యా? పాపపు ద్యూతం ద్వారా అధికారాలు నిర్ణయమవుతాయా? నేనప్పుడు ద్వారకలో ఉండి ఉంటే, ఏ పరిస్థితిలోనూ మీకీ పరిస్థితి రాకపోయేది. ద్యూతమప్పుడు అందరినీ పిలుచుకున్నాడు. కానీ, నాకు ఆహ్వానం పంపలేదు. అయినా నేను సభకు వచ్చి ఉండేవాణ్ణి. ద్యూతం వల్ల వచ్చే అరిష్టాలను గురించి ధృతరాష్ట్రునికీ, దుర్యోధనునికీ నచ్చజెప్పేవాణ్ణి. వారు. విని ఉండకపోతే భీష్మ, ద్రోణ, కృప, బాహ్లికులను వెంటపెట్టుకొని ధృతరాష్ట్రుణ్ణి కలిసేవాణ్ణి. వారి ద్వారా ద్యూతం ఎలా పాపాలకు మూలమో చెప్పించేవాణ్ణి. నలమహారాజు లాంటివాడు ద్యూతం వల్ల ఎలా అంతులేని కష్టాల పాలయ్యాడో తెలియజేసి, శాస్త్రరీత్యాగాని, అనుభవరీత్యాగాని, సదాచార సంపదరీత్యాగాని స్త్రీ లోలత్వం, ద్యూతం వేట, మద్యపానం వంటి సప్తవ్యసనాలు ఎంతటి వాణ్ణైనా అధోగతిపాలు చేస్తాయని, ధర్మబుద్ధి గల వారికి అవి తగవని హెచ్చరించేవాణ్ణి. మహారాజా! అప్పటికి వినకపోతే, అక్కడికక్కడే అందరినీ యమసదనానికి అతిథులుగా పంపి ఉండేవాణ్ణి. అసలు మూలంలోనే అధర్మమున్నది. నీవనుమతిస్తే చాలు. హస్తినాపురం మీదికి దాడి చేద్దాం. మా వెంట వచ్చిన యాదవ యోధాలున్నాయి. యావదార్యావర్తం క్షణాలలో పరుగెత్తుకొని వస్తుంది. కౌరవులను జయించడం మొక కష్టమా?'

'కృష్ణా! నేనే పొరపాటు చేశాను. దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందే. నన్ను విడువని నా తమ్ములు, పాంచాలి నాతో ఈ కష్టాలను పంచుకోక తప్పదు. నా కారణంగా-కేవలం నా కారణంగా వాళ్లకిన్ని బాధలు వచ్చిపడ్డాయి. విధిని ఎవ్వరూ కాదనలేరు. వ్యాసుల వారి వాక్కు వృధా అవుతుందా కేశవా'.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

అన్నింటిని త్యజించినప్పడే (ఒంటరిగా నడచినప్పడే) ఆత్మసాక్షాత్కారం పొందుతారు. అలా పొందినవారు మహాత్ములు అవుతారు. అటువంటి మహాత్ములలో అన్ని ధర్మాలు ప్రకటమవుతాయి. **"అన్నింటిని త్యజించినప్పడే నా నివృత్తి నాథునిలో (సద్గురు నాథునిలో) ఐక్యమయ్యాను"** అని జ్ఞానేశ్వర్ మహారాజ్ అమృతానుభవంలో చెపుతారు. **"హృదయంలోని భగవంతుడిని తెలుసుకున్నప్పడు, అందరు మహాత్ములు ఒక్కటేనని నీకు బోధపడుతుంది"** అని శ్రీ రమణ మహర్షి ఉవాచ! ఆత్మజ్ఞాని అయిన ఆ మహర్షి వాక్కులు వేద ఆఖ్యానాలే కదా! మహాత్ములంతా ఒక్కటే అయినప్పడు, మహాత్ములను మతం యొక్క దృష్టికోణంలో చూడటం ఎంతటి అవివేకమో విజ్ఞులైన పాఠకులు పసిగట్టగలరు. ఏ శాస్త్రం కూడా ఏ మహాత్ముని కంటే గొప్పది కాలేదు. ఈ సత్యాన్నే సత్యద్రష్ట అయిన కబీరు అద్భుతమైన తమ గీతం ద్వారా స్పష్టంగా బోధిస్తున్నారు.

**ఝుగ్‌రా ఏక్ నిబేర్‌హు రామ్ । జఉ తుమ్ అప్నే జన్ సోం కామ్ ॥**

(నేను అయోమయానికి గురవుతున్నాను ఓ భగవంతుడా నీవే నివృత్తి చేయాలి. నువ్వు ఎప్పడయితే నా వాడివి అయ్యావో, ఇక నాకు ఇంకొకరితో ఏమి పని)

**ఇహు మన్ బడాకి సఉ మన్ మానియా। రాము బడాకి రామ్‌హీ జానియా॥**

మనసు, మనసు మూలం కంటే గొప్పదా? రాముడు (భగవంతుడు) ఆ రాముడిని (భగవంతుడిని) తెలుసుకున్నవాడి కంటే గొప్పవాడా?

**బ్రహ్మ బడాకి జాసు ఉపాఇయా । వేదు బడాకి జహా తే ఆయియా॥**





(బ్రహ్మ తన ఆవిర్భవించిన స్థానం కంటే గొప్పవాడా? వేదాలు ఎక్కడ నుండయితే ఉద్భవించాయో అంతకంటే గొప్పవా?)

**కహు కబీర్ హఉ భయియా ఉదాసు । తీరథ్ బడాకి హరి కా దాసు॥**

(కబీరు అంటున్నాడు తాను చాలా అయోమయం చెందాడని! దేవాలయం, దేవుని సేవకుని కంటే గొప్పదా?)

## దాసగణు గోదావరి స్నానం

"సద్గురువు సకల ధర్మాత్ముడు. మన ప్రాపంచిక, పారమార్థిక శ్రేయస్సుకు ఏది హితమో, ఏది అహితమో ఆయనకు పరిపూర్ణంగా తెలుసు" అనే సంపూర్ణ విశ్వాసంతో, ఆ సద్గురుని ఆజ్ఞ ముందర తన సొంత ఇష్టానిష్టాలను పట్టించుకోకుండా, ఆ సద్గురుని ఆజ్ఞను మనసా, వాచా, కర్మణా పాటించడం సచ్ఛిష్యుని ధర్మం. అందులోను, ప్రాపంచిక జీవితాన్ని పూర్తిగా త్యజించి, జీవితంలో కేవలం పారమార్థిక పురోగమనం మాత్రమే లక్ష్యంగా గల దాసగణు వంటి వారికి, ఆ సమర్థ సద్గురు చరణాలే సకల తీర్థక్షేత్రాలు! ఆ సద్గురు దేవుని దివ్య సన్నిధియే పరమానందాన్ని నొసగే ఆనంద పయోనిధి! ఆయన చరణాశ్రయమే, పారమార్థిక శ్రేయస్సును ప్రసాదించే పెన్నిధి!

శ్రీ సాయి వంటి సమర్థ సద్గురు సామ్రాట్టు దివ్య చరణాలను అచంచలంగా ఆశ్రయించాక, మన పారమార్థిక ప్రయోజనం కోసమై ఇక ఏ దేవళాన్ని దర్శించనవసరం లేదు, ఇక ఏ తీర్థంలో మునక వేయాల్సిన అవసరం అసలే లేదు. కానీ, తరాతరాలుగా నరనరాలలో జీర్ణించుకుపోయిన-కాలం చెల్లిన-ఆచారాలు, విశ్వాసాలు పారమార్థిక ప్రవాసంలో అడుగడుగునా అవరోధాలుగా ఎదురవుతుంటాయి. ముందరి కాళ్లకు బంధాలుగా మారి, పారమార్థిక పురోగమనాన్ని అడ్డుకుంటాయి. ఇటువంటి ఛాందస భావాలకు నెలవైన మనసు యథాప్రకారం, యథో చితంగా మనకు హితబోధ మొదలెడుతుంది. "కొన్ని సాంప్రదాయాలను,

పాటించడం మన విద్యుక్త ధర్మమనీ, కొన్ని విశేష సందర్భాలలో ఫలాన దేవళాన్ని దర్శించాలనీ, ఫలనా నదిలో మునగాలనీ, లేకపోతే ఎంతో కొంత కోల్పోతామనీ, అందువలననే అందరూ వెళుతున్నారనీ, పది మంది నడిచే మార్గంలో నడవడమే శ్రేయస్కరమనీ, ఆ విషయం బహుశః నీ నియోజిత సద్గురువుకు తెలియకపోవచ్చనీ, నీవు అలా చేయడం అంటే ఆయన పట్ల భక్తి లేకపోవడం కాదనీ, ఆయనిచ్చే అనుగ్రహంతోపాటు, కొంత నీవు వీటి ద్వారా విడిగా సంపాదించుకుంటున్నావనీ, అందులో తప్పేమి లేదనీ" ఒకటే పోరుతుంది. అంతేకాదు, ఏమరుపాటుగా ఉంటే అదే వాస్తవమని పూర్తిగా మాయలో పడేస్తుంది. తద్వార, పారమార్థిక ప్రగతిలో గతి నిరోధకాలను నిర్మిస్తుంది.

సరిగ్గా, దాసగణు విషయంలో అనేకసార్లు అలానే జరిగింది. ఎన్నో నిగూఢమైన పారమార్థిక సత్యాలను అవలీలగా ఆకళింపు చేసుకున్న గొప్ప పారమార్థిక జ్ఞాని మరియు తన సంకీర్తనలలో శ్రీ సాయి దివ్యచరణమే, భవభయహరణం గావిస్తుందనీ, ఆయన అనుగ్రహమే భవసాగరాన్ని దాటించి ఆవలి తీరానికి చేరుస్తుందని విశేషంగా కీర్తించే దాసగణు, పైన పేర్కొన్న మాయలో ఇట్టే ఇరుక్కుపోయేవాడు. కానీ, నిజగురుడైన సమర్థ సాయినాథుడు తమదైన శైలిలో, దాసగణును ఆవరించిన మాయను అంతరింపజేసిన తీరు అనన్యసామాన్యం, నిజగురు సాంప్రదాయానికే తలమానికం! అద్భుతమైన, అద్వితీయమైన ఈ లీలా పుష్పాలలో దాగియున్న "సాయిబోధ" అనే భవ్య మకరందాన్ని భ్రమరమై గ్రోలుదాం, ఆ దివ్యజ్ఞానాన్ని హృదయమంతా నింపుకొని అమరమై వెలుగుదాం! అందుకు ఉద్యుక్తులవమని ప్రార్థన!

బాబా దాసగణును షిరిడీ నుండి బయటకు కదలనిచ్చేవారు కారు. అలాఅని, తనను ఎక్కువసేపు మసీదులో ఉండనిచ్చేవారు కారు. వెళ్ళి, తన పని తనను చేసుకోమని చెప్పేవారు.

**(సశేషం)**







# రాణి రుద్రమదేవి

భారతదేశము పుణ్యభూమి. వీరవనితలకు పుట్టినిల్లు. ఈ దేశము లోని వీరవనితలెందరో పురుషులకు ఏ మాత్రం తీసిపోకుండా రాజ్యాలను పాలించారు. శత్రువులను చీల్చి చెండాడారు. అలాంటి మహిళామణుల్లో రాణి రుద్రమదేవి చెప్పకోదగిన వీరవనిత. ఆమె ధైర్యసాహసాలతో ఓరుగల్లు సామ్రాజ్యాన్ని కొన్ని దశాబ్దాలు పరిపాలించింది. భారతదేశ చరిత్రలో ప్రముఖ స్థానమునాక్రమించింది.

రుద్రమదేవిని తలుచుకుంటేనే భారతయువతలో ఉత్సాహం ఉరక లేస్తుంది. ఆమె తెలుగుజాతి పౌరుషానికి నిదర్శనము. కవులు, కళాకారులెందరో ఆమె చాకచక్యము, చతురతను తమ కళారూపాలలో కీర్తించారు.

కాకతీయ రాజవంశ ప్రతిష్ఠను ఎన్నో రెట్లు పెంచిన రాణి రుద్రమదేవిని దేశభక్తి భారత వీరులకు, ప్రత్యేకించి మహిళా లోకానికి ఆదర్శము. అసమానమైన ఆమె రాజనీతి చతురత కారణంగా కాకతీయ సామ్రాజ్యములోని ప్రజలు క్రీ.శ.1262 నుండి 1289 వరకు సుఖశాంతులనుభవించారు.

తెలుగునేలను ఎన్నో రాజవంశాలు పాలించాయి. అందులో ముఖ్యమైనది కాకతీయ రాజ వంశము. శౌర్య ప్రతాపాలకు ప్రసిద్ధి చెందినదా వంశము. ఆ వంశములో జన్మించి, దక్షిణ భారతదేశాన్ని సమర్థవంతముగా పరిపాలించిన ధీరురాలు రాణి రుద్రమదేవి.

## కాకతీయ రాజ వంశము

కాకతీయ రాజ వంశానికి మూల పురుషుడు కాకర్త్యగుండన. అతని పూర్వులు హనుమకొండ ప్రాంతానికి వచ్చి చిన్న రాజ్యాన్ని స్థాపించుకున్నారు. వీరి కులదైవము కాకతి దేవమ్మ. అందుకే వారి వంశానికా


పేరు వచ్చింది. మొదట వీరు జైన మతస్తులు. తర్వాత తెలుగునేలలో వ్యాపించిన వీరశైవానికి ప్రభావితులై ప్రజలు ఆదరిస్తున్న శైవమతాన్ని స్వీకరించారు. మొదట వరంగల్ జిల్లాలోని మధిర, మానుకోట ప్రాంతాలను పాలించారు. తర్వాత తమ శక్తియుక్తులనుపయోగించి పెద్ద సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారు.

మొదట వీరు చాళుక్య రాజులకు సామంతులుగా ఉండేవారు. కాకతీయ వంశానికి చెందిన రెండవ ప్రోలరాజు చాళుక్య రాజైన గోవిందునిపై విజయం సాధించి సొంత రాజ్యాన్ని స్థాపించాడు. వీరశైవ మతాన్ని స్థాపించి ప్రజల్లోకి తీసుకెళ్లిన బసవేశ్వరుని కితడు సమకాలికుడు కాబట్టి తాను కూడా శైవమతాన్ని స్వీకరించాడు. హనుమకొండను రాజధానిగా చేసుకుని రాజ్యపాలన సాగించాడు. రామారణ్య ప్రసాదులనే యోగి సలహానుసరించి భూమిలో దొరికిన పరుసవేది లింగానికి స్వయంభూ దేవాలయం కట్టించాడు. ఒకే రాయితో నిర్మించారు కాబట్టి దానిని ఓరుకల్లు అన్నారు. ఓరుకల్లు అనగా ఒకేరాయి అని అర్థముంది. రానురాను అదే వరంగల్ నగరమైనది. ఆ కాలములో ఓరుగల్లు అనేవారు.

ప్రోలరాజు కుమారుడు రుద్రదేవ మహారాజు. సింహాసనమెక్కిన తర్వాత ఎన్నో యుద్ధాలు చేసి కాకతీయ రాజ్యాన్ని అటు కృష్ణానది నుండి గోదావరి వరకు, ఇటు శ్రీశైలం నుండి అటు ద్రాక్షారామం వరకు విస్తరింపజేశాడు. ఈ రుద్రదేవుడే చారిత్రాత్మకమైన కళారూపము వేయి స్తంభాల గుడి కట్టించాడు. అతడు మహావీరుడే కాకుండా మంచి కవి, కళాకారుడు కూడా. అతడే ఓరుగల్లు కోట కట్టించాడు. రుద్రరాజు తర్వాత అతని కుమారుడు గణపతిదేవుడు రాజ్యపాలకుడయ్యాడు. గణపతి దేవుడు రాజనీతిలో ఆరితేరినవాడు. పరిపాలనలో దిట్ట అనిపించుకున్నాడు.







# రెండు రామచిలుకలు

అది దట్టమైన ఒక అరణ్యం. ఆ అరణ్యంలో ఒక చెట్టు మీద రామ చిలుకలు గూళ్ళు కట్టుకుని జీవిస్తూ వచ్చాయి.

ఒక రామచిలుక తన గూటిలో గుడ్లు పెట్టింది. గుడ్లు పెట్టిన కొన్ని రోజుల తరువాత ఒక రోజు ఆ రామచిలుక బైటకు వెళ్లింది. అప్పుడు గాలి కాస్త ఎక్కువగా వీచడంతో గూటిలో ఉన్న గుడ్లలో ఒకటి అటూ ఇటూ కదిలి కిందపడిపోయి విరిగిపోయింది! ఆ గుడ్డు నుండి ఒక చిలుకపిల్ల బైటకు వచ్చింది.

అప్పుడే గుడ్డు నుండి పిల్ల బైటకు రావడం వలన దాని ఒంటికి గుడ్డులోని సొన అంటుకొని ఉంది.

కొద్దిసేపటి క్రితమే గుడ్డు నుండి చిలుకపిల్ల బైటకు వచ్చినందున, దాని వల్ల ఎగరడానికి సాధ్యం కాలేదు, స్వయంగా తానే ఆహారం వెతుక్కోవడానికీ సాధ్యం కాలేదు.

ఈ స్థితిలో ఉన్న ఆ చిలుకపిల్లను, ఆ దారిలో యాదృచ్ఛికంగా పోతున్న ఒక వేటగాడు చూశాడు.

'ఈ చిలుకపిల్లను మరే పక్షి అయినా చూస్తే, ఎత్తుకుపోయి ముక్కుతో పొడిచి చంపేస్తుంది! కాబట్టి నేను దీనిని తీసుకుపోయి పెంచుకుంటాను' అని ఆ వేటగాడు అనుకున్నాడు.

ఆ ఉద్దేశంతో అతడు దారిలో పడి ఉన్న చిలుకపిల్లను, తన వద్ద ఉన్న ఒక బుట్టలో జాగ్రత్తగా ఉంచి, తన గుడిసెకు తీసుకుపోయాడు.

ఇది జరిగిన కొంతసేపటికి ....

మళ్ళీ అదే చెట్టు మీద నుండి, అదే గూడు నుండి, మరో గుడ్డు మునుపటి మల్లేనే కింద పడింది. ఆ గుడ్డు నుండి కూడా ఒక చిలుకపిల్ల బైటకు వచ్చింది. ఈ చిలుకపిల్ల కూడా నిరాదరణతో కొట్టుమిట్టాడ

సాగింది.

ఆ సమయంలో ఆ దారిగుండా ఒక మునివర్యుడు వెళ్లడం తటస్థించింది. ఆయనకు ఆదరణలేని ఆ చిలుకపిల్ల పరిస్థితి అర్థమయింది.

'ఈ చిలుకపిల్ల ఇక్కడ ఇట్లే పడి ఉంటే, తక్కిన పక్షులకు త్వరలోనే ఆహారమైపోతుంది! కాబట్టి దీన్ని నా ఆశ్రమానికి తీసుకుపోయి పెంచుకోవడం ఒక్కటే దీన్ని రక్షించే మార్గం!' అని ఆయన భావించాడు.

ఆ ప్రకారమే మునివర్యుడు చిలుకపిల్లను తన ఆశ్రమానికి జాగ్రత్తగా తీసుకుపోయాడు.

వేటగాడు తీసుకుపోయిన చిలుకపిల్ల, వేటగాని గుడిసెలో పెరుగుతూ కొంతకాలానికి పెద్ద రామచిలుక అయింది.

ఇలా ఉండగా ఒక రోజు ఈ అడవికి ఒక రాజు వేటాడడానికి వచ్చాడు.

ఆయన మండుటెండలో పగలంతా వేటాడడంలో మునిగిపోయాడు.

దాంతో రాజు బాగా అలసిపోయాడు. దాహంతో ఆయన నోరు ఎండిపోసాగింది.

'తాగడానికి నీరు ఎక్కడైనా దొరుకుతుందా?' అనుకుని వెతుక్కుంటూ నడవసాగాడు.

అప్పుడు కాస్త దూరంలో ఆయనకు ఒక గుడిసె కనిపించింది. 'అక్కడకు పోయి నీళ్ళు అడిగి తాగవచ్చు!' అనుకుని రాజు గుడిసె వద్దకు వెళ్ళాడు.

అది మన వేటగాడి గుడిసె. రాజు వెళ్ళినప్పుడు వేటగాడు గుడిసెలో లేడు. అక్కడ వేటగాడు పెంచుకుంటున్న చిలుక మాత్రం ఉంది.

ఆ చిలుక రాజు వస్తూండటం చూసీ చూడగానే "ఎవరో ఒక దొంగ వస్తున్నాడు! వీణ్ణి కట్టిపడేసి బాగా తన్నాలి!" అంటూ సంస్కారహీనమైన పలుకులు పలికింది.





రాజు అనాగరికమైన చిలుక పలుకులను దిగ్భ్రాంతితో విన్నాడు. 'ఇటువంటి కుసంస్కారుల ఇంట్లోకి ఎవరు పోతారు? ఇక్కడికన్న మరో చోటుకు పోయి నీళ్ళు తాగుతాను!' అని నిశ్చయించుకుని అక్కణ్ణుండి వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

రాజు దప్పిక తీవ్రరూపం దాల్చింది. 'ఎక్కడన్నా నీళ్ళు దొరుకుతాయా?' అనుకొంటూ నెమ్మదిగా రాజు నడవసాగాడు.

కాస్త దూరం నడిచిన తరువాత రాజుకు ఒక ఆశ్రమం కనిపించింది. అది మునివర్యుని ఆశ్రమం. 'బ్రతుకుజీవుడా' అనుకొంటూ రాజు ఆశ్రమానికి వెళ్ళాడు. అప్పుడు ముని ఆశ్రమంలో లేడు. మునివర్యుడు పెంచుతున్న చిలుక మాత్రం ఆశ్రమంలో ఉంది.

రాజు రావడాన్ని చిలుక చూసింది. అది రాజును చూసీ చూడగానే "అయ్యా! రండి, రండి! మీకు స్వాగతం! మునివర్యులు బైటకు వెళ్ళి ఉన్నారు. ఆయన కాసేపట్లో వచ్చేస్తారు. మీరు లోపలికి వచ్చి కూర్చోండి. పక్కనే పాలు, పళ్ళు, చల్లని నీరు ఉన్నాయి. సేదతీరడానికి ముందు చల్లని నీరు తాగి, పళ్ళు తిని ఆ తరువాత పాలు తాగండి. పిదప కాసేపు నడుం వాల్చండి" అని సంస్కారం ఉట్టిపడే పలుకులతో రాజును ఆహ్వానించింది.

సంస్కారవంతమైన ఆ చిలుక పలుకులు విని రాజు సంతోషంగా ఆశ్రమంలోకి వెళ్ళాడు.

తరువాత ఆయన చల్లని నీరు తాగి అలుపు తీర్చుకున్నాడు; పిదప పళ్ళు తిని, పాలు కూడా తాగాడు.

బడలిక తీరేదాకా రాజు ఆశ్రమంలో సుఖంగా విశ్రమించాడు.

పై కథలో మనం చూసిన రెండు చిలుకలూ ఒకే తల్లి కన్న పిల్లలు, ఒకే కొమ్మకు పూచిన రెండు పువ్వులు. కాని రెండు చిలుకల మధ్య ఎంతటి తారతమ్యం!

ఈ తారతమ్యానికి కారణం ఏమిటి? అవి పెరిగిన వాతావరణమూ,

పొందిన శిక్షణా అందుకు కారణం.

మొరటువాడైన వేటగాడి వద్ద పెరిగిన చిలుక సంస్కారహీనమైన పలుకులు పలికింది.

మునివర్యుని వద్ద పెరిగిన చిలుక మధురంగానూ, సంస్కారం ఉట్టిపడే పలుకులను పలికింది.

మనం ఉన్నతులైనవారితో, ఉన్నత సంస్కారాలు గల వారితో సాంగత్యం చేసినప్పుడు మనమూ ఉన్నతులమే అవుతాం.

చెడ్డవారితోనూ, చెడు అలవాట్లు గల వారితోనూ మనం నెరపే సాంగత్యం మనలనూ చెడ్డవారిగా పరిణమింపజేస్తుంది.

వర్షపు నీరు మంచినీరు. అది నల్లరంగు మన్నుగల చోట నిలవ ఉంటే నల్లగా ఉంటుంది. అదే నీరు ఎర్రరంగు మన్ను గల చోట నిలవ ఉంటే ఎర్రగా ఉంటుంది. ఈ తారతమ్యం, వర్షపు నీరు నిలవ ఉండే చోట గల మట్టిరంగు కారణంగా ఏర్పడుతుంది. ఈ విధంగానే మనం ఏర్పరచుకునే పరిస్థితి మేరకు మన నైజం మంచిగానో, చెడుగానో పరిణమిస్తుంది.

మురికినీరు మురుగు కాలవలలో చేరితే అది మురికినీరుగానే ఉంటుంది. అదే మురికినీరు గంగానదిలో చేరితే, అది పావన గంగాజలం అయిపోతుంది. ఇది చిన్నవారు పెద్దవారితో నెరపే సాంగత్యం వలన వారు పెద్దవారు అవడం సాధ్యమని చూపుతోంది. అందుకే, "పువ్వుతో చేరిన నార కూడా పరిమళిస్తుంది" అని పెద్దలు చెబుతుంటారు.

జన్మతః రాక్షసుడే అయినప్పటికీ విభీషణుడు, రాముని సాంగత్యం నెరపి శాశ్వత కీర్తిని సముపార్జించుకున్నాడు.

దుర్యోధనుని సాంగత్యం వలన కర్ణుడు నేర చరితుడుగా నిలిచి పోయాడు.

మనం సజ్జనులుగా జీవించాలని కోరుకోవడం మాత్రం చాలదు;





మనం సజ్జనులతోనూ, పెద్దలతోను సాంగత్యం నెరపడం కూడా చేయాలి. అదే కాకుండా దుర్జనుల సాంగత్యాన్ని నెరపకుండా, దురలవాట్ల జోలికి పోకుండా అహర్నిశలూ ప్రయత్నిస్తూ ఉండాలి.

పొలంలో వడ్లను నాటితే మాత్రం చాలదు; వరి పంటకు వచ్చినప్పుడు, పొలంలో మొలిచే కలుపుమొక్కలను సముచిత సమయంలో పీకి పారవెయ్యాలి. అప్పడే పూర్తి ఫలసాయం మనకు లభిస్తుంది.

అలా చెయ్యకుండా పొలంలో పంటతోపాటు కలుపుమొక్కలను కూడా పెరుగనిస్తే, ఫలసాయంలో గంటుపడుతుంది.

జన్మతః అందరూ సమానులే! అయినప్పటికీ వారు వారు చేస్తున్న వృత్తుల తారతమ్యాలను బట్టి స్వభావాలలో మార్పు అనివార్యం.



# అమర్ష భక్తుడు

- ప.పూ.శ్రీ రామకృష్ణానంద స్వాముల వారు (భక్త వైజయంతి నుండి)

భక్తుని పదారవ లక్షణం "అమర్ష భక్తుడు" అమర్షమనగా అసూయ, ఓర్వలేని తనము. ఇది లేనివాడే భక్తుడు.

ఈ కాలంలో భక్తులలో, భక్త సంఘాలలో, భక్త సమాజాలలో "భక్తి" మాట దేవుడెఱుగు గాని యీ "అసూయ" మాత్రం ఏకచ్ఛత్రాధిపత్యం చేస్తుంది.

మహారాజుగారు సూరదాసు గారిని అడిగారు. "మహానుభావా! మీ కవిత్వం గొప్పదా? తులసీదాసు గారి కవిత్వం గొప్పదా? సూరదాసుగారు అన్నారు "నా కవిత్వమే గొప్పది" రాజుగారు మళ్లీ అడిగారు. "తులసీదాసు గారి కవిత్వం యెలాగా ఉంటుంది?"

"మహారాజా! తులసీదాసు గారిది కవిత్వం కాదు. అది మంత్రం. నాది

కవిత్వం. మీరు కవిత్వం సంగతి అడిగారు నేనలా చెప్పాను" సూరదాసు గారి జవాబు.

బసవేశ్వర జయంతుల సందర్భంలో అన్ని భాషలలో "బసవ వచనామృతము"ను ఆ సంఘము వారు ప్రకటించారు.

భగవంతుడు బసవన్నను అడిగాడు. "బసవా! మీ లోకంలో భక్తుడెవరు?" ఆయన అన్నాడు. "నేనే, తక్కినదంతా భగవత్స్వరూపం. భక్తుణ్ణి మాత్రం నేనే".

శ్రీ రామకృష్ణ పరమహంసగారు ఈశ్వరచంద్ర విద్యాసాగరుని సందర్శించేందుకు వెళ్ళారు. "దినమూ నదుల వద్దకు వెళుతూ వచ్చా, ఈనాడు సాగరం వద్దకు వచ్చాను".

ఆయన అన్నాడు "నదుల వద్దకు వెళితే కాస్త మంచినీళ్లైనా లభిస్తాయి, సాగరంలో దొరికేది ఉప్పనీళ్ళేనే!"

పరమహంస గారన్నారు "మీరు చెప్పేది అవిద్యాసాగరం మాట. ఇది విద్యాసాగరమే".

భక్తుడు అమర్షరహితుడు. అసూయలేనివాడు. అసూయలేని లక్షణాలను నీతిశాస్త్రం యిలా చెప్పింది.

"గుణినోనగుణాన్‌హంతి - వేత్తి మందగుణానపి ।

నాన్యదోషేషు రమతో - సో2నసూయః ప్రకీర్తితః ॥"

మంచిగుణాలను అసహ్యించుకోడు. "ఫలానావాడు ఫస్టుక్లాసులో పాసైనాడు" - అని అంటే 'ఆఁ' కాపీ కొట్టాడులే-అనే స్వభావం వానికి లేదు. మంచి తక్కువగా వున్నా పెద్దగా స్వీకరిస్తాడు. వానిది "మశక వృత్తి" కాని మక్షికవృత్తి కాదు. మశక మనగా చీమ. అది దుమ్మునంత వదిలి చక్కెరనే తీసుకొంటుంది. మక్షిక మనగా ఈగ, ఈగ మంచిచోటినంత వదిలి మురికి పైననే వాల్తుంది.





# మాతృసంస్థ కబుర్లు

సాయిధామం సేవాశ్రమ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన గురుసేవకే అంకితమై ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన శ్రీ మాతా శుకవాణి (మాతాజీ) 83వ జన్మదిన వేడుకలు నవంబర్ 25న సాయిధామంలో ఘనంగా నిర్వహించడమైనది. పాఠశాల విద్యార్థులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు అమ్మకు నివాళులు అర్పించగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ ఆశ్రమానికి మాతాజీ అందించిన సేవలను తమ ప్రవచనం ద్వారా తెలియజేశారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదం వినిమయం జరిగింది. నవంబర్ 25న శ్రీ సాయీ విద్యాధామం ఉన్నత పాఠశాల 31వ వార్షికోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ముఖ్యఅతిథులుగా శ్రీ మాన్యశ్రీ ఎక్కా చంద్రశేఖర్ గారు, స్థానిక మండల విద్యాధికారి శ్రీమతి రోజారాణిగారు, మండల ప్రజా పరిషత్ పర్యవేక్షకులు శ్రీ గడ్డ జ్ఞానప్రకాశ్‌రెడ్డిగారు, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ ఇన్‌ఛార్జి మేనేజింగ్ ట్రస్టీ శ్రీ డా॥ చంద్రారెడ్డిగారు, ట్రస్ట్ సభ్యులు శ్రీ బుచ్చిరెడ్డిగారు, శ్రీ గోపీకృష్ణగార్లు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య, నాటికలు ఎంతో ఆకట్టుకున్నాయి. తదనంతరం ఆటల పోటీలలో గెలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

డిసెంబర్ 14న దత్తాత్రేయ స్వామి వారి జయంతి సందర్భంగా సాయిదత్త పీఠం ప్రతి ఏటా నిర్వహించే శ్రీదత్త మహాయాగం 108 యజ్ఞ కుండాలతో అద్భుతంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పరిసర గ్రామ ప్రజలే కాకుండా అనేక జిల్లాల నుండి వచ్చి కూడా భక్తులు పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొనటం ద్వారా తమ కష్టాలు తొలగి, తమ జీవితాలు బాగుపడుతున్నాయని, తమ కోర్కెలు నెరవేరుతున్నాయనీ, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దత్త వైభవం

మరియు యజ్ఞ ఫలం గురించి స్వామీజీ శ్రీ రామానంద ప్రభుజీ వారు వివరించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా తమ సొంత ఖర్చులతో ప్రింట్ చేయించి భక్తులకు ఆశ్రమ క్యాలెండర్ అందించారు శ్రీ ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణ, సాయి మాధురి గార్లు. ఈ కార్యక్రమానికి తమ సహాయసహకారాలు అందించిన భక్తులందరికీ దత్తాత్రేయ స్వామి వారి అనుగ్రహం లభించాలని మనసారా ప్రార్థన చేస్తుంది శ్రీ సాయి దత్తపీఠం, సాయిధామం సేవాశ్రమం.

డిసెంబర్ 25న సాయిధామం సేవాశ్రమంలో 22 సంవత్సరాలు పెరిగిన చి॥ సాయిసుధ వివాహం చి॥ అరవింద్‌రెడ్డితో సాయిధామం సేవాశ్రమంలో "శ్రీ కళ్యాణి" కళ్యాణమండపంలో ఉదయం గం.10.08 ని.లకు ఘనంగా జరిగింది. వధూవరులను ఆశీర్వదిస్తూ వివాహం యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలానంద భారతి మాతాజీ. పాఠశాల విద్యార్థులు కోలాటం, నృత్యాలతో వచ్చిన పెళ్లి పెద్దలను ఆనందింపజేశారు. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు వధూవరులను ఆశీర్వదిస్తూ ఆశ్రమం నేర్పిన సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ ఎల్లప్పుడూ పాటిస్తూ గురుదేవుల, మాతాజీ ఆశీస్సులు ఎల్లవేళలా పొందమని, సభ్య సమాజంలో గౌరవప్రదమైన జీవనం కొనసాగిస్తూ, ఆశ్రమాన్ని, ఆశ్రమ సేవలను విస్మరించవద్దని ఆశ్రమ భక్తుల సమక్షంలో వధూవరులకు గురుప్రసాదాన్ని అందించారు. అప్పగింతల సమయంలో ఆశ్రమాన్ని, ఆశ్రమ పరివారాన్ని విడిచి వెళుతున్న సాయిసుధ తనతోపాటే పెరిగిన గీత, సాయిభారతి, సాయి తేజస్వినిని పట్టుకొని భోరున విలపించటం చూసిన భక్తుల హృదయాలు ఒక్కసారిగా బరువెక్కి వారూ విలపించారు. అనంతరం మేళతాళాలతో సాయిసుధ, అరవింద్‌రెడ్డికి, పెళ్లి బృందం వారికి వీడ్కోలు పలికారు ఆశ్రమం వారు.





# భగవద్భక్తికి భాగ్యకాంక్ష ఆటంకమవుతుంది

- "చిరుదీపాలు" నుండి

ఒకసారి నారద మహర్షి విష్ణువాసానికి వెళ్లి లక్ష్మీదేవిని స్తుతించాడు. భర్త విష్ణుమూర్తిని క్షణకాలం కూడా వదలక సేవించే సతివంటూ, ఇంతటి భాగ్యానికి నోచుకున్న భర్త ఎంతటి పుణ్యాత్ముడో అన్నాడు. ఆ తర్వాత విష్ణువు వంకకు తిరిగి "ఇలాంటి పతివ్రతా శిరోమణిని భార్యగా కల్గి ఉండి కూడా తామెందుకలా ఎప్పడూ చింతాక్రాంతులై ఉంటా?రని' ఆయన్ని ప్రశ్నించాడు.

అందుకు విష్ణుమూర్తి 'నువ్వు ఎవ్వరినైతే ఇంతగా శ్లాఘిస్తున్నావో, ఆవిడే నా చింతకు మూలం' అన్నాడు.

'అదెలా? ఇంతగా సేవించే ఈ సతి మీకు తోడు నీడై యుండగా, ఈవిడే మీ దుఖానికి కారణమవడం ఏమి సబబు?' అన్నాడు నారదుడు.

'చూపిస్తా చూడు' అన్నాడు విష్ణువు.

✡ ✡ ✡

భూమండలంలో ఒక దేశంలో ఒక చిన్న గ్రామం. అక్కడ భగవంతుణ్ణి ఎవరూ పూజించేవారు కాదు. సత్సంగమనేది ఎరుగరు. అందరూ ఎప్పుడూ ఏదో ఒక చెడు కార్యంలో మునిగి ఉండేవారు. భగవంతుడు అక్కడ అవతరిస్తూ, హరికథా భాగవతార్‌గా వేషం మార్చుకున్నాడు. చేతిలో వీణ పుచ్చుకొని ఆ ఊళ్ళో కథా కాలక్షేపం ప్రారంభించాడు. మొదట్లో కొందరు వచ్చి వినసారంభించారు. రానురాను ఊరిలో వారంతా వచ్చి వినసాగారు. ఆయన మధ్యాహ్నం ఏ మూడు గంటలకో కథ మొదలుపెట్టేసరికి, ఊళ్లోని వారందరూ ఇళ్లకు తాళాలు పెట్టుకొని, సభాస్థలికి వచ్చి కథంతా విని సాయంత్రానికి ఇంటికి వెళ్లేవారు. ఆయన చెప్పేది గంటసేపే అయినా, ముందే వెళ్లి కూచోకపోతే మంచి చోటు దొరకదనే భయంతో రెండు గంటల వేళే ఇళ్ల నుండి బయల్దేరేవారు.

ఒక ఇంట్లో అత్తగారు, ఆడబిడ్డలూ అందరూ త్వరగా పనులు

ముగించుకొని, కోడళ్ని, ఇల్లు సర్ది తాళం పెట్టి రమ్మని చెప్పి వెళ్ళారు. కోడలు ఇంట్లోని పనులన్నీ ముగించుకొని, ఇంటికి తాళం పెట్టబోతుండగా, ఓ వృద్ధ వనిత కర్ర పట్టుకొని అటువచ్చి 'అమ్మా కాసిన్ని మంచి నీళ్ళు ఇవ్వు' అన్నది.

'నేను అవతల కథ వినడానికి వెళ్ళే వేళకు ఈవిడెక్కడి నుండి ఊడిపడ్డదిరా తండ్రీ?' అనుకుంది కోడలు.

అయితే భాగవతార్ ఒక సందర్భంలో 'దాహం అడిగిన వారికి నీరు అందివ్వడం, ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడం మన పరమ ధర్మ'మని చెప్పాడు. ఇప్పడీవిడకు నీళివ్వకపోతే పాపం చుట్టుకుంటుంద'నుకున్నది.

'అవ్వా, నేను హరికథ వింటానికి వెళ్తున్నాను. త్వరగా వెళ్ళకపోతే అక్కడ కూచోడానికి అనువైన చోటు దొరకదు. మంచినీళ్లైతే తెచ్చిస్తాగానీ త్వరగా తెమలాలి' అన్నది. 'గబగబా తాగుతానమ్మా నాకు దాహం అమితంగా వున్నది' అన్నది ఆ వృద్ధురాలు. ఇంటికోడలు లోనికి వెళ్లి పాత్రతో మంచినీరు తెచ్చి యిచ్చింది. వృద్ధురాలు నీళ్ళు తాగి పాత్ర తిరిగి ఇచ్చింది. కోడలు చేతిలోకి వచ్చిన పాత్ర ధగధగా మెరుస్తున్న బంగారుపాత్ర!

'అవ్వా, నేను నీకిచ్చింది ఈ పాత్రలో కాదు. నువ్వు నాది నాకు తిరిగి ఇవ్వాల్సిందిపోయి, నీ వద్దనున్న పాత్ర ఇచ్చినట్లున్నావు' అన్నది కోడలు.

'నువ్వించ్చింది ఇదేనమ్మా నా వద్ద మరే పాత్రా లేదు' అన్నదా వృద్ధురాలు. 'నేను రాగిపాత్ర ఇచ్చానమ్మా'.

'నా వద్ద బంగారు పాత్రలు ఎలా వుంటాయమ్మా? నేను బిచ్చగత్తెని. వేసుకోవడానికి నాకు సరైన దుస్తులే లేవు. నా సంచి చూడు. ఇందులో ఏమీ లేదు. మరి నీవిచ్చిన పాత్రే తిరిగిచ్చాను'.

'మా ఇంట్లో కాస్తంత బంగారం కూడా లేదు కదా అవ్వా? అయినప్పటికీ మేము తృప్తిగానే బతుకుతున్నామనే విషయమలా వుంచు. నేను నీకిచ్చింది మాత్రం రాగిపాత్రే. నాకిప్పటికే వేళ మించిపోయింది. నా రాగి పాత్ర నాకిస్తే ఇంటికి తాళం పెట్టి బయల్దేరిపోతాను' అన్నది కోడలు.

'నన్నేమి చేయమంటావమ్మా? నేనేది ముట్టుకున్నా అది బంగారమై కూచుంటుంది. బహుశా అందువల్లే నీవు రాగిపాత్రలో నీరిచ్చినప్పటికీ





అది నా చేతికి రాగానే బంగారుపాత్ర అయివుంటుంది' అన్నది వృద్ధురాలు.

'అయితే ఇలా లోపలికి రా!'

అవ్వ లోనికి వెళ్లింది. 'కాస్త ఇక్కడున్న ఈ తాళాన్ని ముట్టుకో', అని నెమ్మదిగా అన్నది కోడలు. అవ్వ ముట్టుకోగానే అది బంగారమైంది. 'ఈ తలుపు గడియ ముట్టుకో' అన్నది కోడలు. అదీ బంగారమైంది. ఇంట్లో అన్నిరకాల వస్తువులూ ముట్టుకోవడమే తరువాయి, అన్నీ బంగారమైపోసాగినై. ఈ సువర్ణ క్రియలో హరికథకు వెళ్ళాలనే మాటే మరిచింది ఆ కోడలు.

మర్నాడు కోడలును కలిసినవారు 'నిన్న హరికథకెందుకు రాలేదు? భగవతార్‌గారు నిన్న భలే కథ చెప్పాడు?' అన్నారు. 'కథ వింటే కడుపునిండుతుందా? నిన్న ఓ వృద్ధమాత మా ఇంటికి వచ్చింది. ఆవిడ ఏది ముట్టుకుంటే అది బంగారంగా మారింది' అన్నది కోడలు. 'నిజమా?' అని అక్కడున్న వారందరూ ఒక్కసారిగా అడిగారు.

అందరూ కలిసి ఆ వృద్ధురాల్ని దర్శించారు. మా ఇంటికి రమ్మని వేడుకున్నారు. 'క్యూలలో నిలబడ్డారు. ఇక అటు తర్వాత ఆ ఊళ్ళో సభాస్థలి వద్దకు వెళ్లి హరికథ వినేవారు కరువైపోయారు. మారువేషంలో నున్న మహావిష్ణువు కాళ్లకు గజ్జెలు కట్టుకొని, చేతిలో చిరుతలు పట్టుకొని ఎంత నిరీక్షించినా తన కథ వినడానికి వచ్చినవారు లేరు.

అపుడక్కడికి నారదుడు వచ్చాడు. విష్ణువు నారదునితో 'చూశావా నారదా?' నా అవసరం ఎక్కడ ఉన్నదనుకుంటానో నేనక్కడికి వెళతాను. అక్కడ వారు బాగుపడతారు. సంతృప్తిగా బతకడం నేర్చుకుంటారు. కానీ నేవెళ్లిన అనతికాలంలోనే నా సతీమణి నన్ననుసరించి అక్కడికి వస్తుంది. ఇక ఆవిడ వచ్చిందంటే నా ముఖం చూసేవారుండరు. అపుడు నేను ఊరు వదలి వెళ్ళాల్సొస్తుంది' అన్నారు.

భగవానుడి వెంట లక్ష్మి వచ్చినప్పటికీ భగవానుని మీదనే ఉంచుకుంటే భాగ్యలక్ష్మి కూడా అక్కడే నివసిస్తుంది. మనుషులు భగవానుని నిర్లక్ష్యం చేస్తే ఆయనతోబాటు లక్ష్మి కూడా తరలిపోతుంది.

**- ప్రకాశానంద సరస్వతి**